ఆశిష్-అద్వైతలకు శుభాశీస్సులు అందిస్తున్న అక్కినేని నాగార్జున, నాగచైతన్య

కొత్త జంటతో కథానాయిక రష్మిక మందన్న

ఆశిష్-అద్వైతలతో రామ్‌చరణ్

మూడుముళ్లు పడ్డాయి.. ఏడేడు జన్మలబంధం ఏడడుగులతో మొదలైంది.. ఆశిష్, అద్వైతలు దైవ సాక్షిగా ఒకటయ్యారు. అగ్ర నిర్మాత దిల్‌రాజు ఇంట పెళ్లి సందడి అంటే మామూలుగా ఉంటుందా..! తారల ఆగమనంతో హైదరాబాద్ ఎన్ కన్వెన్షన్ సెంటర్ పాలపుంతలా మారింది. శుక్రవారం జరిగిన దిల్‌రాజు సోదరుడు శిరీష్ కుమారుడైన హీరో ఆశిష్ వివాహ రిసెప్షన్‌కి పలువురు సినీ ప్రముఖులు హాజరై కొత్తజంటకు శుభాకాంక్షలు అందించారు. ఆ ఫొటోలు ఇవి.

అశిష్-అద్వైతలకు శుభాకాంక్షలందిస్తున్న కల్యాణ్‌రామ్

నూతన జంటతో విజయ్ దేవరకొండ

# ప్రాణాలకు తెగించి ఆ సీన్స్ చేశాను

కియారా అద్వానీ అద్భుత సౌందర్యరాశి. దానికి తగ్గట్టే సున్నితమైన పాత్రలు చేస్తూ దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్నది కియారా. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను చేసే పనిలో ఉన్నది ఈ అందాలభామ. వివరాల్లోకెళ్తే.. ప్రస్తుతం ఆమె నటిస్తున్న చిత్రాల్లో ప్రతిష్టాత్మక చిత్రంగా 'డాన్3'ని చెప్పుకోవాలి. 'డాన్' ఫ్రాంచైజ్‌లో ఇప్పుడు కియారా కూడా భాగమయ్యారు. ప్రియాంక చోప్రా బాధ్యతను ఈసారికి కియారా తీసుకున్నారని చెప్పొచ్చు. ఇందులో కథానాయకుడిగా రణ్‌బీర్‌సింగ్ నటిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. ఇదిలావుంటే రీసెంట్‌గా ఈ సినిమాలోని తన పాత్ర గురించి మీడియాతో మాట్లాడింది కియారా. 'నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమా 'డాన్ 3'. తొలిసారి ఈ సినిమాకోసం యాక్షన్ సీన్స్‌లో నటించాను. ఈ కేరక్టర్‌కోసం యాక్షన్ కొరియోగ్రాఫర్ దగ్గరకెళ్లి ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. ప్రాణాలకు తెగించి ఆ సీన్స్‌లో నటించాను. ఇంకా చేయాల్సిన సీన్స్ చాలా ఉన్నాయి. ఇందులో నా పాత్ర పేరు రోమా. ఈ పాత్రలో కొత్త కియారాను చూస్తారు. థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి ఈ సినిమా చూడాలని ఉంది' అని ఆనందం వ్యక్తం చేసింది కియారా అద్వానీ.

# అనుకున్న తేదీకే 'కల్కి 2898 ఏడీ'

తప్పుడు వార్తలను సృష్టించడమే కొందరి జీవన విధానం. రేటింగుల కోసం వాస్తవాలను మరుగున పరచడమే వీరి వృత్తి. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' సినిమా తాజాగా వీరి బారిన పడింది. ఈ సినిమాను మే 9న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. 'కల్కి 2898 ఏడీ' అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న సోషియో ఫాంటసీ ఫిక్షన్ మూవీ కావడం, ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొణే, దిశా పటానీ, పశుపతి లాంటి సూపర్‌స్టార్స్ ఇందులో నటిస్తుండటం.. పైగా సీజీ వర్క్‌తో కూడిన సన్నివేశాలు ఎక్కువగా ఉండటం.. ఈ కారణాలవల్ల విడుదలకు ఇంకాస్త జాప్యం జరిగే అవకాశాలున్నాయనేది ఈ వార్తల సారాంశం. ఈ నేపథ్యంలో ఈ రూమర్లపై చిత్రబృందం స్పందించింది. ప్రభాస్‌కి సంబంధించిన 'జస్ట్ ది వార్మ్ అప్' క్యాప్షన్‌తో వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో ద్వారా మే 9నే 'కల్కి 2898 ఏడీ' విడుదల కానుందని మేకర్స్ తెలిపారు. వైజయంతీ మూవీస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నది.

# ఆయనతో 'జవాన్' కంటే గొప్ప సినిమా చేస్తాం

'భారతీయ సినిమాకు షారుక్ ఓ అపురూప వరం. నా జీవితంలో నేను చూసిన గొప్ప వ్యక్తుల్లో షారుక్ ఒకరు. 'జవాన్' చిత్రీకరణ సమయంలో షారుక్ నుంచి ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నా.' అన్నారు దర్శకుడు అట్లీ. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అట్లీ మాట్లాడుతూ షారుక్ గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'అనుకున్న విధంగా సన్నివేశాన్ని చిత్రీకరించగలిగితే సినిమా తప్పక విజయం సాధిస్తుందని 'జవాన్' సినిమా అనుభవం నాకు నేర్పింది. ఓపికతో షూటింగ్ చేయడం కూడా ఈ సినిమా నుంచే నేర్చుకున్నా. దీనికి కారణం షారుక్ సార్. చిన్నప్పట్నుంచీ నేను ఆయన అభిమానిని. దిల్‌వాలే దుల్హనియా లేజాయింగే, ఓంశాంతి ఓం, చెన్నయ్ ఎక్స్‌ప్రెస్ నాకు ఇష్టమైన సినిమాలు. ఆయనతో కలిసి పనిచేయాలనేది నా చిరకాల కోరిక. 'జవాన్'తో నా కోరిక తీరింది. ఆయన అభిమానాన్ని కూడా పొందగలిగాను. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండటం షారుక్‌సార్‌కి మాత్రమే సాధ్యం. మళ్లీ ఆయనతో కలిసి పనిచేయాలనుంది. 'జవాన్'కంటే మంచి కథ కుదిరితే తప్పకుండా ఆయనతో వర్క్ చేస్తా' అని చెప్పుకొచ్చారు అట్లీ. ఆయన దర్శకత్వంలో షారుక్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన విషయం తెలిసిందే.

# శనివారం శత్రువుల వేట



నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. శనివారం నాని జన్మదినం సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. ఎస్.జే.సూర్య వాయిస్‌తో టీజర్ మొదలైంది. కోపాన్ని ఓ క్రమపద్ధతిలో వాడుకునే వ్యక్తిగా నాని పాత్రను పరిచయం చేశారు. 'నా పేరు సూర్య. కోపం చూపిచడానికి ఒక్కరోజు చాలు' అంటూ నాని చెప్పిన డైలాగ్ ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. కేవలం శనివారాల్లో మాత్రమే తన శత్రువును వేటాడే పాత్రలో నాని పవర్‌ఫుల్‌గా కనిపించారు. రగ్గెడ్ లుక్‌లో మాస్ అవతారంలో ఆకట్టుకున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జే.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.

# వినోద ప్రధానంగా మార్కెట్ మహాలక్ష్మి

'కేరింత'ఫేం పార్వతీశం, ప్రణీకాన్విక జంటగా రూపొందుతోన్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. వీఎస్ ముఖేష్ దర్శకుడు. అఖిలేశ్ కలారు నిర్మాత. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రం టీజర్‌ని హీరో శ్రీవిష్ణు లాంచ్ చేశారు. సినిమా మంచి విజయం సాధించి, అందరికీ మంచి పేరు తీసుకురావాలని, నిర్మాతకు ఆర్థికంగా లాభాలు చేకూరలని ఆకాంక్షించారు. సినిమాలో నటించడం పట్ల హీరో హీరోయిన్లు ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో చిత్రయూనిట్ మొత్తం పాల్గొన్నారు. హర్షవర్ధన్, మహబూబ్ బాషా, ముక్కు అవినాష్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిస్టర్ జో, కెమెరా: సురేంద్ర చిలుముల.

# హాలీవుడ్ సినిమాల ప్రేరణతో 'చారి 111'

'నా కెరీర్ ఎడిటర్‌గా మొదలైంది. పాకెట్‌మనీకోసం టీవీ సీరియల్స్, యాడ్ ఫిల్మ్స్ ఎడిటింగ్ చేసేవాడ్ని. కొన్ని యాడ్ ఫిల్మ్స్ డైరెక్ట్ చేశాను కూడా. పదేళ్లు యాడ్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్నా. ఆ తర్వాత హైదరాబాద్ రావడం, 'మళ్లీ మొదలైంది'తో దర్శకుడ్ని కావడం అనుకోకుండా జరిగిపోయింది' అని తెలిపారు దర్శకుడు కీర్తి కుమార్. కామెడీ ప్రధానంగా ఆయన తీసిన తాజా సినిమా 'చారి 111'. వెన్నెల కిశోర్ టైటిల్‌రోల్ చేశారు. సంయుక్తా విశ్వనాథన్ కథానాయిక. అదితి సోని నిర్మాత. మార్చి 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరులతో ముచ్చటించారు కీర్తికుమార్. ' 'మళ్లీ మొదలైంది' షూటింగ్ టైమ్‌లోనే ఈ ఐడియా వెన్నెల కిశోర్‌కి చెప్పాను. ఆయన స్క్రిప్ట్ సెండ్ చెయ్యమన్నారు. చదివి ఓకే చెప్పారు. పింక్ పాంథర్, జానీ ఇంగ్లీష్ వంటి హాలీవుడ్ సినిమాలు ఈ కథకు ప్రేరణ. 'జానీ ఇంగ్లీష్' సినిమా చూసినప్పుడు దర్శకుడ్ని అయితే, ఇటువంటి కథతో వెన్నెల కిశోర్‌తో సినిమా చేయాలని అప్పుడే అనుకున్నాను. ఆ కోరిక ఇలా నెరవేరింది. వెన్నెల కిశోర్, మురళీశర్మలను దృష్టిలోపెట్టుకొని ఈ స్క్రిప్ట్ రాశాను' అని చెప్పారు కీర్తికుమార్. చిరంజీవి చంటబ్బాయ్, రుద్రనేత్ర చిత్రాల వాసన ఈ సినిమాలో ఉంటుందని, తెరపై ఆర్టిస్టులు సీరియస్‌గా ఉంటారని, కానీ కామెడీ మాత్రం అద్భుతంగా పండుతూ వుంటుందని ఆయన తెలిపారు. 'ఇందులో 'విలన్ ఎవరనేది సస్పెన్స్. అది తెరపైనే చూడాలి. అందుకే అతడ్ని మాస్క్‌లో చూపిస్తున్నాం. భవిష్యత్తులో స్టార్‌హీరోలతో కూడా సినిమాలు చేస్తాం' అని కీర్తికుమార్ చెప్పారు.

# 'భీమా' దుష్టశిక్షణ

'దర్శకుడు హర్ష ఈ కథను ఎంత బాగా చెప్పాడో అంతే బాగా తెరకెక్కించాడు. ఈ సినిమా కోసం టెక్నీషియన్స్ అందరూ అద్భుతంగా పనిచేశారు. మహాశివరాత్రి రోజున ప్రేక్షకులకు కొత్త అనుభూతి నందిస్తుంది' అన్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా ఏ.హర్ష దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భీమా'. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మించారు. మహాశివరాత్రి కానుకగా మార్చి 8న విడులదకానుంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దుష్ట శిక్షణ కోసం ఎంతకైనా తెగించే పోలీస్ ఆఫీసర్ పాత్రలో గోపీచంద్ పాత్రను ప్రజెంట్ చేసిన విధానం ఆకట్టుకుంది. యాక్షన్, మాస్ అంశాలతో ట్రైలర్ మెప్పించింది. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కన్నడంలో ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఈ సినిమాతో తెలుగులో కూడా గుర్తింపు దక్కుతుంది. కథలోని ఫ్యామిలీ ఎలిమెంట్స్ అందరికీ కనెక్ట్ అవుతాయి' అన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించే చిత్రమిదని దర్శకుడు హర్ష తెలిపారు. భారీ స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని నిర్మాత కె.కె.రాధామోహన్ అన్నారు.



# సస్పెన్స్ థ్రిల్లర్ 'బహుముఖం'

స్వీయ దర్శకనిర్మాణంలో హర్షివ్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ అండ్ ది యాక్టర్' ఉపశీర్షిక. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన ఈ సినిమా ట్రైలర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క ఆవిష్కరించారు. హీరోలోని భిన్న కోణాల్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. కౌన్సిలింగ్ సెషన్‌లో భాగంగా హీరో సైకో థెరపిస్ట్ దిశను కలవడం, తన కలను నెరవేర్చుకోవడానికి ఆమె సహాయాన్ని కోరడం, తన చుట్టూ వున్న వ్యక్తుల తాలూకు కొన్ని సీక్రెట్స్ తనకు తెలుసునని చెప్పడం ఆసక్తిని పెంచింది. హీరో, దర్శకుడు హర్షివ్ కార్తిక్ మాట్లాడుతూ 'ఆమెరికాలో తీసిన పక్కా తెలుగు సినిమా ఇది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఆసూహ్య మలుపులతో సాగుతుంది. చిరంజీవి స్ఫూర్తిగా సినీ రంగంలోకి వచ్చాను. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా అందరిని మెప్పిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ల్యూక్ ఫ్లెచర్, సంగీతం: ఫణి కల్యాణ్, రచన, నిర్మాణం, దర్శకత్వం: హర్షివ్ కార్తీక్.




# అంచనాలు నిజమయ్యాయి

విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా వేణు మురళీధర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ముఖ్య గమనిక'. రాజశేఖర్, సాయికృష్ణ నిర్మాతలు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉందంటున్నారు. కంటెంట్ బాగుంటే తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని మా సినిమా నిరూపించింది. కొన్ని ఏరియాల్లో థియేటర్లను పెంచబోతున్నాం. ఈ సినిమా విషయంలో మా అంచనాలన్నీ నిజమయ్యాయి' అన్నారు. తమ సంస్థ నిర్మించిన తొలి చిత్రానికి ప్రేక్షకుల చక్కటి ఆదరణ కనబరుస్తున్నారని, ఇక నుంచి ప్రతి సంవత్సరం ఓ సినిమాను తెరకెక్కిస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రయూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.